సాక్షి
కామారెడ్డి

బుధవారం। 13। ఆగస్టు। 2025



ప్రజలకు అందుబాటులో ఉండాలి

కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్ మంగళవారం బీబీపేట, దోమకొండలలో పర్యటించారు. అభివృద్ధిపై అధికారులతో సమీక్షించారు.

- 8లో ▸



ప్రాథమిక విద్య కీలకం

జిల్లాలోని పలు మండలాలలో ఉల్లాస్ కార్యక్రమంపై ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
34.2 /22.7

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

న్యాయవాదులకు హెల్త్ కార్డులు



కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం న్యాయవాదులకు హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద రమేశ్ మాట్లాడుతూ కార్డు ద్వారా రూ. 2 లక్షల వరకు ఉచితంగా వైద్యం పొందవచ్చన్నారు. హెల్త్ కార్డులు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. హెల్త్ కార్డు పరిమితిని రూ. 10 లక్షలకు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బండారి సురేందర్‌రెడ్డి, అడిషనల్ పీపీ నిమ్మ దామోదర్‌రెడ్డి, ప్రతినిధులు అమృతరావు, బి.దామోదర్ రెడ్డి, గజ్జెల భిక్షపతి, లక్ష్మణ్‌రావు, ప్రదీప్‌రెడ్డి, రజనీకాంత్, కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ దేవరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

‘పౌష్టికాహారం అందించాలి’



కామారెడ్డి క్రైం : గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీరాణి సూచించారు. మంగళవారం జిల్లాకు వచ్చిన ఆమె కలెక్టరేట్‌లోని సంక్షేమ శాఖ అధికారి కార్యాలయాన్ని సందర్శించారు. అధికారుల పనితీరు, అమలు చేస్తున్న పథకాలపై సమీక్షించారు. అనంతరం డ్రైవర్స్ కాలనీ, రాజీవ్‌నగర్ కాలనీల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, సఖి కేంద్రం, ప్రభుత్వ బాలికల వసతి గృహాలను సందర్శించారు. నిర్మాణంలో ఉన్న సఖి కేంద్రం భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై కేసు



కామారెడ్డి క్రైం: ఇందిరమ్మ ఇళ్ల పేరిట ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్పీ రాజేశ్ చంద్ర తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. జుక్కల్ పోలీసులు మంగళవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. డ్రైవర్ ఫారీని విచారించగా ఇసుక అక్రమ రవాణా వ్యవహారం బయటపడింది. జుక్కల్ మండలం సోపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పేరుతో తహసీల్దార్ ద్వారా అనుమతి పత్రాలు పొంది మంజీర నుంచి ఇసుకను అక్రమంగా కర్ణాటక ప్రాంతానికి తరలిస్తున్నట్లు విచారణలో అంగీకరించారు. రూ.900 లకు వచ్చే ట్రాక్టర్ ఇసుకను రూ.9 వేలకు అమ్ముకుంటున్నారని తేలిందని ఎస్పీ పేర్కొన్నారు. ట్రాక్టర్ యజమాని మహమ్మద్ ఆదిల్ ఇక్కడి నుంచి కర్ణాటకకు చెందిన మదన్ సోపేంద్ర బీదార అనే వ్యక్తికి ఇసుకను పంపిస్తున్నాడని తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేశామని, ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని, డ్రైవర్‌ను అరెస్ట్ చేశామని పేర్కొన్నారు.

నేడు ఇందిరమ్మ ‘మార్కింగ్ మహా మేళా’

నిజామాబాద్‌అర్బన్:ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల వేగవంతానికి నిజామాబాద్ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల ‘మార్కింగ్ మహా మేళా’ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. బుధవారం ఒకే రోజు 831 ఇళ్ల నిర్మాణానికి మార్కింగ్ ఇవ్వడానికి ఏర్పాట్లు చేశారు. ఏకకాలంలో ఇందిరమ్మ ఇళ్ల పనుల ప్రారంభానికి శ్రీకారం చుట్టాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. నిజామాబాద్ జిల్లాకు 17,301 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా.. అందులో 9,526 ఇళ్ల నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయి. ఇందులో బేస్‌మెంట్ లెవల్‌లో 5,043, రూఫ్ లెవల్‌లో 796, స్లాబ్ పూర్తయినవి 256 ఉన్నాయి. ఇందిరమ్మ లక్ష్యాన్ని చేరుకుని రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉండాలన్న లక్ష్యంతో కలెక్టర్ చర్యలు తీసుకుంటున్నారు.

■ గాంధారికి చెందిన మోచి చరణ్‌రాజ్ (32) ఏప్రిల్ 26న హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రికి తరలించగా బ్రెయిన్ డెడ్ అయినట్టు గుర్తించారు. ఆయన తల్లిదండ్రులు మోచి పద్మ, రవి.. తమ కుమారుడి అవయవాలను దానం చేశారు. తమ కుమారుడు కళ్లముందు లేకున్నా, నలుగురికి జీవితాన్నిచ్చాడని వారు పేర్కొంటున్నారు.



■ భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డికి చెందిన మెట్టు ప్రవీణ్ (27) గతేడాది జులై 12న రోడ్డు ప్రమాదంలో గాయపడగా హైదరాబాద్‌కు తరలించి చికిత్సలు చేయించారు. బ్రెయిన్ డెడ్ కావడంతో ఆయన కుటుంబ సభ్యులు అవయవాలు దానం చేయడానికి అంగీకరించారు. ప్రవీణ్‌కు తల్లిదండ్రులతో పాటు భార్య, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు.



■ కామారెడ్డి పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన పి.సోహిత (17) కొన్నాళ్ల క్రితం స్పృహతప్పి కిందపడిపోగా.. మెదడులో రక్తస్రావం అయినట్టు గుర్తించిన వైద్యులు హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. అక్కడ వారం పాటు వైద్యం అందించినా లాభం లేకుండాపోయింది. బ్రెయిన్ డెడ్ అయిందని వైద్యులు తెలిపారు. వైద్యులు ఆమె తల్లిదండ్రులు కల్యాణి, విజయ్‌లకు అవగాహన కల్పించి అవయవాలు దానం చేయించారు.



జీవన్ దాన్!

■ స్పందిస్తున్న హృదయాలు ■ అవయవదానంతో నిలుస్తున్న ప్రాణాలు
■ ఒకరి దానంతో నలుగురి జీవితాల్లో వెలుగులు ■ నేడు ప్రపంచ అవయవదాన దినోత్సవం



సాక్షి ప్రతినిధి కామారెడ్డి : తమ ఇంటిదీపం ఆరిపోతోందని ఆందోళన చెందుతున్న కుటుంబాల్లో అవయవదాతలు వెలుగులు నింపుతున్నారు. మృత్యు అంచుల్లో ఉన్న వారిలో జీవకళ తెస్తున్నారు. తమ శరీరంలో దెబ్బతిన్న అవయవాల స్థానంలో ఇతరుల నుంచి సేకరించిన వాటిని అమర్చడంతో మృత్యువు దగ్గరిదాకా వెళ్లిన వారు సాధారణ జీవనం సాగిస్తున్నారు. చాలా వరకు రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారిలో మెదడు పనిచేయదు. దీనిని వైద్యులు బ్రెయిన్‌డెడ్‌గా పరిగణిస్తారు. బ్రెయిన్ డెడ్ అయినా ఆ వ్యక్తి శరీరంలోని గుండె, కిడ్నీలు, కళ్లు, ఊపిరితిత్తులు, కాలేయం వంటి అవయవాలు పనిచేస్తాయి. కుటుంబ సభ్యుల అంగీకారంతోనే వైద్యులు అవయవాలను సేకరిస్తున్నారు. వాటిని అవసరమైన వారికి అమర్చి పునర్జన్మ ఇస్తున్నారు. బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి నుంచి సేకరించిన గుండె, ఊపిరితిత్తులను నాలుగు గంటలలోపు, కాలేయాన్ని 12 గంటలలోపు, కిడ్నీలను 48 గంటల్లోపూ ఇతరులకు అమర్చాల్సి ఉంటుంది. ఇలాంటి సందర్భంలో బాధితుడి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించి, బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి శరీరం నుంచి ఆయా అవయవాలను సేకరించి ఇతరులకు అమర్చడం ద్వారా నలుగురికి ఊపిరి పోస్తున్నారు వైద్యులు.

శరీరంలో ప్రధానమైన గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, కాలేయం వంటి అవయవాలు దెబ్బతిని ఎంతోమంది ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. అవయవ మార్పిడి జరగక ఎన్నో జీవితాలు అర్ధంతరంగా ముగిసిపోతున్నాయి. అయితే బ్రెయిన్ డెడ్‌కు గురైన వారి నుంచి అవయవాలను సేకరించి అలాంటి వారికి అమర్చడం ద్వారా ప్రాణాలను నిలిపే అవకాశాలున్నాయి. జిల్లాలో పలువురు బ్రెయిన్‌డెడ్ కాగా.. వారి కుటుంబ సభ్యులు అవయవాలను దానం చేసి ఎన్నో ప్రాణాలను నిలిపారు.

జిల్లాలో ఇరవై మందికిపైగా...

జిల్లాలో అవయవదానంపై అవగాహన పెరుగుతోంది. పదేళ్ల కాలంలో బ్రెయిన్ డెడ్ అయిన ఇరవై మందికిపైగా అవయవాలను దానం చేశారు. వారి కుటుంబ సభ్యుల ఆమోదం మేరకు అవయవాలను సేకరించి అవసరం ఉన్న రోగులకు అమర్చడం ద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి పునర్జన్మ ప్రసాదించారు. జీవన్‌దాన్ సంస్థ అవయవ దానంపై అవగాహన కల్పించడంతో పాటు బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తుల కుటుంబ సభ్యులను ఒప్పించి అవయవాలను దానం చేయడానికి సహకరిస్తోంది. జిల్లాలోనూ అవయవదానంపై వివిధ సంఘాలు అవగాహన కల్పిస్తున్నాయి.

జవాబుదారీతనమే ప్రధానం



మాట్లాడుతున్న చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, వేదికపై సమాచార కమిషనర్ మొహ్సినా పర్వీన్

- ప్రతి పౌరుడికి సమాచారం అడిగే హక్కు ఉంది
- తక్కువ ఫిర్యాదులున్న జిల్లాల్లో కామారెడ్డికి 3 స్థానం
- రాష్ట్ర సమాచార చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న కమిషనర్ అయోధ్యరెడ్డి

కామారెడ్డి క్రైం : జవాబుదారీతనం గల సమాజాన్ని నిర్మించే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర సమాచార చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల పీఐవో(పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్)లు, జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులకు మంగళవారం కలెక్టరేట్‌లో సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. సమావేశంలో రాష్ట్ర సమాచార చీఫ్ కమిషనర్‌తో పాటు సమాచార కమిషనర్‌లు మొహ్సినా పర్వీన్, దేశాల భూపాల్, అయోధ్య రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో చీఫ్ కమిషనర్ మాట్లాడుతూ తక్కువ ఫిర్యాదులు ఉన్న జిల్లాల్లో కామారెడ్డి మూడో స్థానంలో ఉందన్నారు. ఇక్కడ జవాబుదారీతనం ఎక్కువగా ఉన్నట్లు భావిస్తున్నామన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు వచ్చే ప్రతి కార్యాలయం, సంస్థలకు సంబంధించిన సమాచారాన్ని పౌరులు పొందవచ్చన్నారు. ఇందుకోసం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పీఐవోలను తప్పనిసరిగా నియమించాలన్నారు. రికార్డులు, ఉద్యోగుల వివరాలు, విధులు, బాధ్యతలతో కూడిన 41బి రిజిస్టర్‌లు అన్ని కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలన్నారు. సమాచారం అడిగే వ్యక్తి ఎందుకు సమాచారం అడుగుతున్నాడో చెప్పాల్సిన అవసరం లేదన్నారు. దరఖాస్తు తీసుకున్న 30 రోజుల్లోగా (సేకరించి ఇవ్వాల్సిన సందర్భాల్లో 45 రోజులు) పీఐవో సమాచారం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. లేని పక్షంలో దరఖాస్తుదారుడు మొదటి అప్పీల్ చేసుకోవచ్చన్నారు. 90 రోజుల్లోగా సమాచారం రాకుంటే రెండో అప్పీల్‌కు వెళ్లవచ్చన్నారు. ఆలస్యం చేస్తే నష్టపరిహారం వరకు వెళ్లే వెసులుబాటు చట్టంలో ఉందన్నారు. అన్ని స్థాయిల అధికారులు సమాచార హక్కు చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

పారదర్శకతతోనే విశ్వసనీయత..

పారదర్శకత, జవాబుదారీతనం, అవినీతి రహిత పాలనతోనే ప్రజల్లో విశ్వసనీయత పెరుగుతుందని కమిషనర్ అయోధ్యరెడ్డి పేర్కొన్నారు. పీఐవోలు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కార్యాలయాల్లోని పూర్తి సమాచారాన్ని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కమిషన్ ఆధ్వర్యంలో ఏ కార్యాలయంలో, ఎప్పుడైనా తనిఖీలు జరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. భోజన విరామం తర్వాత జరిగిన రెండో సెషన్‌లో జిల్లాకు సంబంధించి రెండో అప్పీల్ కేసులపై శాఖల వారీగా విచారణ జరిపారు. కార్యక్రమంలో ఎస్పీ రాజేశ్‌చంద్ర, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఏఎస్పీ చైతన్యరెడ్డి, అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్, ఆర్డీవోలు వీణ, పార్థసింహారెడ్డి, వివిధ శాఖల జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు, పీఐవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎంలపై ఆరోపణలు అర్థరహితం



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిన్న రాజులు

- కాంగ్రెస్ నేతలది తప్పుడు ప్రచారం
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు

కామారెడ్డి టౌన్: ప్రజాక్షేత్రంలో ఓటమి పాలవుతూ కాంగ్రెస్ నాయకులు ఈవీఎంలపై ఆరోపణలు చేయడం అర్థరహితమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు విమర్శించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజా శ్రేయస్సు, దేశ ప్రయోజనాలే ప్రధానంగా దేశ ప్రధాని మోదీ పని చేస్తున్నారన్నారు. వరుసగా మూడు పార్లమెంటు ఎన్నికల్లో ఓటమి పాలైన కాంగ్రెస్ నాయకులు ఈవీఎంలను తప్పుబట్టడం సమంజసం కాదన్నారు. కర్ణాటక, తెలంగాణల్లోనూ ఈవీఎంలతోనే ఎన్నికలు నిర్వహించారని, ఆ ఎన్నికలలో గెలిచినప్పుడు ఎందుకు ఈవీఎంలపై ఆరోపణలు ఎందుకు చేయలేదని కాంగ్రెస్ నేతలను ప్రశ్నించారు. బీజేపీకి, మోదీకి ప్రజల్లో ఆదరణ పెరగడాన్ని జీర్ణించుకోలేకే రాహుల్‌గాంధీ, ఇండి కూటమి నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఓటరు జాబితాపై అనుమానాలు ఉంటే ఈసీ అడిగినట్లుగా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు శ్రీకాంత్, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అతి భారీ వర్షాలు కురిసే అవకాశం

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



సీఎంతో వీసీలో పాల్గొన్న కలెక్టర్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్ చంద్ర, జిల్లా స్థాయి అధికారులు

కామారెడ్డి క్రైం : జిల్లాలో రాబోయే 72 గంటల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర సమయాల్లో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 08468–220069 లో సంప్రదించాలన్నారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టరు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ముందస్తు చర్యలపై సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. వీసీ అనంతరం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. వర్షాల వల్ల జిల్లాలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అత్యవసరం అయితే తప్ప ప్రజలు ఇళ్లలోంచి బయటికి రావద్దని సూచించారు. ఈత కొట్టడానికి పిల్లలను చెరువులు, వాగుల్లోకి పంపరాదన్నారు. మత్స్యకారులు చేపలు పట్టడానికి వెళ్లవద్దన్నారు. రైతులు విద్యుత్ మోటార్లు, వంగి ఉన్న విద్యుత్ స్తంభాల వద్ద జాగ్రత్తగా ఉండాలన్నారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉండటం మంచిది కాదన్నారు. ప్రమాదకరంగా వరద నీరు ప్రవహించే లోలెవెల్ వంతెనలు, కల్వర్టులు, కాజ్‌వేల వద్దనుంచి ప్రజలు, వాహనాలు వెళ్లకుండా బారికేడ్‌లను ఏర్పాటు చేయాలని పోలీసు, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖల అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు.

బుధవారం ఉదయం 11 గంటలకు అన్ని మండల కేంద్రాల్లో మండల స్థాయి అధికారులు పంచాయతీల కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ముందస్తు చర్యలపై ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్పీ రాజేశ్‌చంద్ర, అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

‘ఉమ్మడి జిల్లాలో రూ. 120 కోట్ల రుణాలిచ్చాం’



మాట్లాడుతున్న డీసీసీబీ జీఎం అనుపమ

నాగిరెడ్డిపేట : ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.120 కోట్ల రుణాలను అందించామని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు జనరల్ మేనేజర్ అనుపమ తెలిపారు. సుమారు 98 వేల మంది రైతులు పంట రుణాలు, దీర్ఘ కాలిక రుణాలు పొందారన్నారు. మంగళవారం ఆమె నాగిరెడ్డిపేట సహకార కేంద్ర బ్యాంకును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో కర్షక్‌మిత్ర ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో సుమారు 1,500 మంది రైతులకు రూ. 30 కోట్ల వరకు రుణాలు ఇచ్చామన్నారు. సుమారు రూ.480 కోట్ల వరకు గోల్డ్‌లోన్‌లు అందించామన్నారు. ఖాతాదారులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి కొత్త రుణాలను పొందాలని సూచించారు. ఆమె వెంట డీజీఎం సుమమాల, స్థానిక బ్యాంకు మేనేజర్ ఎల్లేశం ఉన్నారు.

‘లక్‌పతి దీదీ’కి మూడు సంఘాల ఎంపిక



సభ్యులను అభినందిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వం గుర్తించిన ‘లక్‌పతి దీదీ’ అనే కేటగిరీకి మన జిల్లా నుంచి 3 స్వయం సహాయక సంఘాలు ఎంపికయ్యాయని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. కేంద్రం తెలంగాణ రాష్ట్రం నుంచి మొత్తం 5 సంఘాలను ఎంపిక చేయగా వాటిలో 3 సంఘాలు మన జిల్లాకు చెందినవేనని పేర్కొన్నారు. ఎంపికైన లింగంపేట, కామారెడ్డి మండల సమాఖ్యల అధ్యక్షులు గడ్డం సులోచన, గరిగె గోదావరి, బీర్కూర్ మండలం నుంచి బొందుగుల సవిత ఈనెల 15 న ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవాల్లో ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొంటారని తెలిపారు. వారు కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రత్యేక ఆహ్వానితులుగా ఎంపికైన వారిని కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో సురేందర్, అదనపు డీఆర్‌డీవో విజయలక్ష్మి, డీపీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

కామారెడ్డి క్రైం: రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పిలుపునిచ్చారు. కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థుల సహకారంతో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కళాశాల పూర్వ విద్యార్థి బాల్‌రాజ్ గౌడ్ జ్ఞాపకార్థం కళాశాల ఆడిటోరియంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రక్తదానం చేసిన విద్యార్థులు, అధ్యాపకులను కలెక్టర్ అభినందించారు. గతేడాది మాదిరిగానే ఈసారి కూడా రక్తదానం విషయంలో రాష్ట్రంలోనే జిల్లా ముందుండాలన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ రాజన్న, కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమార్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు రఘుకుమార్, దస్తీరాం, నరసింహం, రమేశ్‌రెడ్డి, అధ్యాపకులు శ్రీనివాస్‌రావు, సుధాకర్, బాల్‌రాజ్ గౌడ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

కామారెడ్డి అర్బన్: కలెక్టరేట్‌లోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో గురువారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి కల్పనాధికారి మల్లయ్య తెలిపారు. ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కల్పన కోసం ఈ మేళా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఏదేని డిగ్రీ పూర్తి చేసినవారు గురువారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మేళాకు హాజరు కావాలని, పూర్తి వివరాలకు 80968 57078, 76719 74009 నంబర్‌లలో సంప్రదించాలని సూచించారు.

పోచారం ప్రాజెక్టుకు జలకళ

- పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరువలో జలాశయం
- వానాకాలం పంటల సాగుకు పూర్తి భరోసా



పోచారం ప్రాజెక్టు నీటి మట్టం

నాగిరెడ్డిపేట : పోచారం ప్రాజెక్టు జలకళ సంతరించుకుంది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో వరదనీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టులో నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతూ పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరువయ్యింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 21.5 అడుగులు(1.820 టీఎంసీలు) కాగా మంగళవారం సాయంత్రానికి 20 అడుగుల (1.682 టీఎంసీ) నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి వచ్చి చేరిన నీరు ఆయకట్టు పరిధిలో వానాకాలం పంటల సాగుకు సరిపోతుందని రైతులు పేర్కొంటున్నారు.

అధికారుల్లో నిశ్చింత..

పోచారం ప్రాజెక్టు నుంచి ఆయకట్టు కోసం ఈనెల ఆరో తేదీన ప్రధాన కాలువలోకి నీటిని విడుదల చేశారు. ఆ సమయంలో ప్రాజెక్టులో 17 అడుగులతో 1.244 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అయితే సరైన వర్షాలు లేకపోవడం, ఆయకట్టు పరిధిలోని చెరువులు, కుంటలు ఖాళీగా ఉండడం, కాలువలు సైతం పొదలతో అధ్వానంగా ఉండడంతో చివరి ఆయకట్టు వరకు నీటిని అందించడం అధికారులకు ఇబ్బందిగా మారింది. ప్రాజెక్టులో ఉన్న నీటితో ఆయకట్టును చివరి వరకు గట్టెక్కించడం కష్టమన్న అభిప్రాయం వ్యక్తమయ్యింది. కానీ వారం రోజులుగా ఎగువన కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టు నీటిమట్టం పెరగడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం ఉన్న నీటితో వానాకాలం పంటలకు పూర్తి స్థాయిలో నీరందించవచ్చని పేర్కొంటున్నారు.

రుణాలను సకాలంలో చెల్లించాలి



తాండూర్‌లో స్పెషల్‌డ్రైవ్‌లో పాల్గొన్న స్త్రీనిధి రీజనల్ మేనేజర్ కిరణ్‌కుమార్

నాగిరెడ్డిపేట: మహిళా సంఘాల సభ్యులు స్త్రీనిధి ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని జిల్లా స్త్రీనిధి రీజినల్ మేనేజర్ కిరణ్‌కుమార్ సూచించారు. మంగళవారం గోపాల్‌పేట, బొల్లారం, చీనూర్, ధర్మారెడ్డి, జలాల్‌పూర్, తాండూర్ గ్రామాల్లో రుణ బకాయిల వసూళ్ల కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది స్త్రీనిధి ద్వారా రూ. 95 కోట్లు రుణాలుగా అందించాలన్నది లక్ష్యమన్నారు. వాటిలో ఇప్పటివరకు 30 శాతం రుణాలను అందించామన్నారు. జిల్లావ్యాప్తంగా రూ. 20 కోట్ల స్త్రీనిధి రుణాల బకాయిలు ఉన్నాయన్నారు. నాగిరెడ్డిపేట మండలంలో రూ. 3 కోట్ల వరకు బకాయిలున్నాయని పేర్కొన్నారు. బకాయిల వసూళ్ల కోసం స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామన్నారు. ఆయన వెంట సీసీలు దత్తు, శ్రీనివాస్ రెడ్డి, సుజాత, అకౌంటెంట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు క్రీడాదుస్తుల వితరణ



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని గోపాల్‌పేట హైస్కూల్‌లో 25మంది విద్యార్థులకు మంగళవారం స్థానిక ఎస్సై భార్గవ్‌గౌడ్ క్రీడా దుస్తులను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై భార్గవ్‌గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత స్థాయికి చేరాలన్నారు. హెచ్ఎం వెంకట్రాం రెడ్డి, పీడీ సభాత్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో టై, బెల్ట్‌లు..



భిక్కనూరు: మండలంలోని తిప్పాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కామారెడ్డి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం టై, బెల్ట్‌లను పంపిణీ చేశారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు సిద్ధంగా ఉన్నట్లు రోటరీ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు రాఘవ రెడ్డి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు శంకర్, ఉపాధ్యాక్షులు జైపాల్‌రెడ్డి,ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ పున్న రాజేశ్, సభ్యుడు సుధాకర్,హెచ్ఎం యాదగిరి, ఉపాధ్యాయులు నర్సింహరెడ్డి, ఉమారాణి, సురేశ్, అజ్జులు పాల్గొన్నారు.

23న ఎల్లారెడ్డికి మందకృష్ణ మాదిగ రాక

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డికి ఈనెల 23న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ రానున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు సామెల్ అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డిలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధిక సంఖ్యలో పెన్షన్ దారులు హాజరు కావాలని కోరారు. నాయకులు పద్మారావు తదితరులున్నారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

- నాణ్యమైన వైద్యం విద్య పేదలకు అందాలి
- అధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి



బీబీపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

బీబీపేట/దోమకొండ : మండల స్థాయిలు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు.బీబీపేట, దోమకొండ మండల పరిషత్ కార్యాలయాల్లో మండలానికి చెందిన వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులతో మాట్లాడారు. ఇక నుంచి ప్రతి రెండు నెలలకు ఒకసారి రివ్యూ సమావేశం ఉంటుందని, తానే హాజరవుతునాని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆయా శాఖల్లో ఉన్న సమస్యలను అధికారులు వివరించారు. అలాగే ప్రతి గ్రామంలో వంద శాతం పన్నులు వసూలు చేయాలని కార్యదర్శులకు సూచించారు. అంగన్‌వాడీ లో నూతన భవనాలు మంజూరు అయినందున ప్రభుత్వ స్థలాన్ని చూసి కేటాయించాలని తహసీల్దారుకు తెలిపారు. విద్య, వైద్యంలో ఎలాంటి పొరపాట్లు జరిగినా ఊరుకునేది లేదని అన్నారు. గ్రామాల వారిగా పూర్తి వివరాలు ఉన్నాయని ఏ శాఖలో తప్పులు జరిగినా సహించేది లేదని సూచించారు. వైన్స్‌ల వద్ద ఉన్నటువంటి పర్మిట్ రూంల్లో వసతులు ఉండాలని తెలిపారు.రైతులకు యూరియా కొరత రాకుండా చూడాలని వ్యవసాయశాఖ అధికారులు, సింగిల్ విండో కార్యదర్శులకు ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్లు గంగసాగర్, సుధాకర్, ఎంపీడీవోలు పూర్ణచంద్రోదయకుమార్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, మండల వ్యవసాయాధికారులు దీపిక, నరేందర్, ఎక్సైజ్‌శాఖ సీఐ మధుసూధన్‌రావ్, ఐసీడీఎస్ సీడీపీవో రోషిక్మ, ఉపాధిహామీ ఏపీవో రజని, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో బంగారు భవిష్యత్తు

భిక్కనూరు: విద్యార్థులు చిన్నతనం నుంచి క్రమశిక్షణతో ముందుకెళ్తే వారి భవిష్యత్తు బంగారు మయం అవుతుందని ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి అన్నారు. భిక్కనూరు మండలం ఇసన్నపల్లి, భాగిర్తి పల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

గ్రామానికి చెందిన భూమి మాకే చెందాలి



తిర్మన్‌పల్లి గ్రామ శివారులో భూమి వద్ద బోర్డు పాతిన గ్రామస్తులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామ శివారులో గల ఇనాం భూమిని అమ్మడానికి, కొనుగోలు చేయడానికి వీలు లేదని ఈభూమి గ్రామానికే చెందాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. గ్రామానికి సేవ చేస్తున్న గైని కులస్తులకు గత కొన్ని సంవత్సరాల క్రితం అప్పటి పెద్ద మనుషులు 3 ఎకరాల 15 గుంటల భూమిని ఇచ్చారు. ఈభూమిని గ్రామస్తులకు తెలియకుండా మర్కల్‌కు చెందిన మర్కంటి బుచ్చన్నకు సేల్‌డీడ్ చేయించిన విషయం గ్రామస్తులకు తెలియడంతో మంగళవారం బుచ్చన్నను గ్రామానికి పిలిపించి ఇనాం భూమిని ఎలా కొన్నావని ప్రశ్నించారు. గైని వారికి కొన్ని డబ్బులు ఇచ్చానని నేను ఇచ్చిన డబ్బులు నాకు ఇస్తే ఈభూమిని వారికే ఇస్తానని సమాధానం చెప్పారు. దీనికి గ్రామస్తులు ఒప్పుకోలేదు. తమ గ్రామానికి చెందిన భూమి తమకే చెందే వరకు ఊరుకునేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూమి గ్రామానికి చెందని యెడల టిప్పర్లతో మొరం నింపి భూమిని చదును చేస్తామని హెచ్చరించారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు భూమిలో ఎలాంటి పంట పెట్టవద్దని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ మధుసూదన్ రావు, మాజీ సర్పంచ్ బాల్ రెడ్డి, విండో డైరెక్టర్‌లు మధుసూదన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యా బలోపేతానికి కృషి

- గురుకుల పాఠశాల సందర్శించిన ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే

బిచ్కుంద(జుక్కల్): రాష్ట్రంలో విద్యా బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, అన్ని పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. మంగళవారం బిచ్కుందలోని మైనారిటీ బాలుర గురుకుల పాఠశాల సందర్శించి రికార్డులు, కిచెన్, తరగతి గదులు పరిశీలించారు. విద్యార్థులు, ప్రిన్సిపాల్ సునీతతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద విద్యార్థులకు గురుకుల పాఠశాలలు వరంగా మారాయన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలన్నారు. క్లోరినేషన్ చేసిన నీటిని అందించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, నాయకులు నాగ్‌నాథ్ పటేల్, గంగాధర్, బొగడమీది సాయిలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

మద్నూర్(జుక్కల్): మండలంలోని సుల్తాన్‌పేట్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు, రిటైర్డ్ టీచర్ మొయిన్‌పటేల్ అనారోగ్యంతో మృతి చెందారు. మంగళవారం జరిగిన అంత్యక్రియల్లో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు, మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సమస్యలు పరిష్కరించండి

- హౌసింగ్ కార్పొరేషన్ ఎండీకి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు విన్నపం



ఇందిరమ్మ ఇళ్ల సమస్యలను ఎండీకి అందజేస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్‌కు ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు విన్నవించారు. మంగళవారం ఆయనను హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలను చర్చించారు. పలు డిమాండ్లను, సూచనలను అందజేశారు. ఇళ్ల నిర్మాణం పూర్తయి ఫోటోలు అప్‌లోడ్ చేసి నెల రోజులు కావస్తున్నా కొందరు లబ్ధిదారులకు డబ్బులు జమ కావడం లేదని ఎమ్మెల్యే ఎండీకి వివరించారు. అలాగే పథకం ప్రారంభానికి ముందు నిర్మించిన బేస్‌మెంట్లకు ఆమోదం ఇచ్చినా చెల్లింపులు జరగడం లేదని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన పరిమితి కంటే చిన్న ప్లాట్లలో కూడా జీ ప్లస్ నిర్మాణానికి అనుమతించాలని కోరారు. 400–600 చదరపు అడుగుల పరిమితిలో 20 చదరపు అడుగులు వరకు భిన్నంగా ఉన్నా అనుమతించాలని కోరారు. ఇళ్ల నిర్మాణం వేగవంతం కావడానికి ప్రతి మండలానికి ఒక అసిస్టెంట్ ఇంజనీర్‌ను నియమించి పర్యవేక్షణ బలోపేతం చేయాలని కోరారు. అర్హులైన ఇతర కుటుంబాలకు కూడా అదనపు ఇళ్లు మంజూరు చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణంలో ఏవైనా చిన్న లోపాలు ఉంటే వాటిని సరిదిద్దుతూ బిల్లులు చెల్లింపులు చేయాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించుకున్న లబ్ధిదారుల చెల్లింపులు ఆలస్యం అవుతున్న కారణంగా వారికి త్వరగా బిల్లులు చెల్లించేలా చూడాలని సూచించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



కామారెడ్డి క్రైం: పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు మంగళవారం కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నా, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రతి నెల 1వ తేదీన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. దాదాపు గంట పాటు ధర్నా చేపట్టారు. ధర్నాలో పారిశుధ్య, వాటర్ వర్క్స్ కార్మికులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు

- ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌కు పిట్లం ఎస్సై అటాచ్

కామారెడ్డి క్రైం: విధుల్లో నిర్లక్ష్యం కనబరిచిన ఇద్దరు పోలీసులపై ఎస్పీ రాజేశ్ చంద్ర చర్యలకు ఉపక్రమించారు. దోమకొండ పీఎస్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న విశ్వనాథ్‌ను సస్పెండ్ చేశారు. అతడు వాహనాల తనిఖీల్లో భాగంగా ప్రయాణికులతో దురుసుగా ప్రవర్తించిన విషయంలో కొందరు వ్యక్తులు ఎస్పీ ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. గతంలో కూడా అతనిపై ఇలాంటి ఫిర్యాదులు ఉన్నట్లు ఉన్నతాధికారులు గుర్తించారని సమాచారం. ఈ నేపథ్యంలోనే సస్పెండ్ చేసినట్లు తెలుస్తుంది. అలాగే విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని దృష్టికి రావడంతో పిట్లం ఎస్సై రాజును ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేశారు. ఈఘటన జిల్లా పోలీసుశాఖలో చర్చనీయాంశంగా మారింది.

సూచిక బోర్డుల ఏర్పాటు



నస్రుల్లాబాద్ : మండలంలో జరుగుతున్న 765డి రోడ్డు పనులలో భాగంగా ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త కోసం సూచిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు ఎస్సై రాఘవేంద్ర తెలిపారు. మంగళవారం మండల వ్యాప్తంగా ప్రమాదకరంగా ఉన్న గుంతల వద్ద సంబంధిత వారితో మాట్లాడి సూచిక బోర్డులను పెట్టించారు. రాత్రి వేళ్లలో గుంతలు ఉన్న చోటు కనబడే విధంగా రేడియం స్టిక్కర్లు ఉంచాలన్నారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో రెండురోజుల జైలు శిక్ష

కామారెడ్డి క్రైం: పట్టణంలో ఇటీవల పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా కామారెడ్డి మండలం క్యాసంపల్లి గ్రామానికి చెందిన నిఖిల్ మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. అతడిని పోలీసులు మంగళవారం కామారెడ్డి కోర్టులో హాజరుపర్చారు. ద్వితీయశ్రేణి న్యాయమూర్తి చంద్రశేఖర్ అతడికి రెండు రోజుల జైలుశిక్ష, రూ.200 జరిమానా విధించినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో నరహరి తెలిపారు.

భిక్కనూరులో..

భిక్కనూరు : మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డ ఒక్కరికి కామారెడ్డి ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి చంద్రశేఖర్ రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై అంజనేయులు మంగళవారం తెలిపారు. మండల కేంద్రంలోని టోల్‌ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా మెదక్ జిల్లా చేగుంట మండలం ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి ఒక్కరూ మద్యం సేవించి వాహనం నడుపుతు పట్టుబడ్డాడు. సదరు వ్యక్తిని అరెస్టు చేసి కామారెడ్డి ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి చంద్రశేఖర్ ముందర ప్రవేశపెట్టగా రెండు రోజులు జైలుశిక్షతో పాటు రూ.200 జరిమానా విధించినట్లు ఎస్సై వివరించారు.

పేకాడుతున్న 10మంది అరెస్టు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని వడ్లం గ్రామంలో పేకాట ఆడుతున్న పదిమందిని అరెస్టు చేసినట్లు ఎస్సై అరుణ్ కుమార్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు గ్రామంలోని పేకాట స్థావరంపై సోమవారం రాత్రి దాడి చేశారు. పేకాడుతున్న పది మందిని పట్టుకొని, వారి వద్ద నుంచి రూ.14430 నగదును, 9 ఫోన్లు, ఐదు బైక్‌లు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

కేజీబీవీ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం?

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో గల కేజీబీవీలో వారం క్రితం ఓ ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని ఆత్మహత్యకు యత్నించినట్లు తెలిసింది. వివరాలు ఇలా.. జిల్లాకేంద్రానికి చెందిన ఓ విద్యార్థిని కేజీబీవీలో ఇంటర్ ఎంపీసీ ఫస్టియర్ చదువుతోంది. గత మంగళవారం అర్ధరాత్రి ఆమె కేజీబీవీ భవనం నుంచి కిందకు దూకింది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలై, కేకలు వేయడంతో కేజీబీవీ సిబ్బంది వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం జిల్లాకేంద్రానికి, అక్కడినుంచి హైదరాబాద్‌కు తరలించారు. ఘటనపై కేజీబీవీ ప్రత్యేకాధికారిణిని వివరణ కోరగా.. హాస్టల్ గది నుంచి విద్యార్థిని బయటకు రాగా కోతి దాడిచేయడంతో ఆమె గోడ దూకినట్లు వెల్లడించింది.

ఆత్మహత్యకు యత్నించిన యువతి.. కాపాడిన పోలీసులు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో ఆత్మహత్యకు యత్నించిన ఓ యువతిని కాపాడినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. వివరాలు ఇలా.. రెంజల్ మండలం వీరన్న గుట్ట గ్రామానికి చెందిన మౌనిక (21) మంగళవారం సాయంత్రం నిజామాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించింది. వెంటనే విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ హనుమాండ్లు, కానిస్టేబుల్ పండరి, షీటీమ్ ఇన్‌చార్జి వరలక్ష్మి యువతిని గమనించి, వివరాలు తెలుసుకున్నారు. ఇంట్లో సమస్యలు ఉన్నాయని, తనకు పెళ్లి చేయడం లేదని ఆమె వారికి వివరించింది. అనంతరం వారు ఆత్మహత్య చేసుకోవద్దని ఆమెకు కౌన్సెలింగ్ చేశారు. అనంతరం ఆమెను నగరంలోని సదరన్ హోం సూపరింటెండెంట్ జ్యోత్స్నకు అప్పగించినట్లు చెప్పారు.

బస్సు దిగుతుండగా కిందపడ్డ విద్యార్థి

- కాళ్ల మీదనుంచి బస్సు టైర్ వెళ్లడంతో గాయాలు

నిజాంసాగర్ (జుక్కల్): మండలకేంద్రంలోని గాంధీచౌరస్తా వద్ద ఓ విద్యార్థి బస్సు దిగుతుండగా కిందపడటంతో కాళ్లమీదనుంచి బస్సు టైర్ వెళ్లడంతో గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. మహమ్మద్ నగర్ మండలం గాలిపూర్ గ్రామానికి చెందిన కురుమ మహేష్ అచ్చంపేట మాడల్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి వెళ్లేందుకు అతడు నిజాంసాగర్ బస్టాండ్‌కు వచ్చాడు. ఈక్రమంలో పిట్లం వైపు వెళ్తున్న ఓ బస్సు ఎక్కాడు. కొద్దిసేపటికి బస్సు ఎల్లారెడ్డి వైపు వెళ్లదని తెలుసుకొని, బస్సు వెళుతుండగానే డోర్ నుంచి కిందకు దూకాడు. అతడు కిందపడిపోగా బస్సు టైర్ కాలు మీదనుంచి వెళ్లడంతో గాయపడ్డాడు. ప్రయాణికులు గమనించి వెంటనే కేకలు వేయడంతో బస్సును ఆపివేశారు. మహేష్‌ను చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని బస్సును పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని దేవాయిపల్లి గ్రామశివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై మురళి తెలిపారు. వివరాలు ఇలా.. దేవాయిపల్లి గ్రామానికి చెందిన తెడ్డుచిన్న బాలరాజు(46) సోమవారం రాత్రి కాలినడకన గ్రామం నుంచి కామారెడ్డి–ఎల్లారెడ్డి రోడ్డు మీదుగా తాడ్వాయి వైపు బయలుదేరాడు. ఈక్రమంలో కామారెడ్డి నుంచి తాడ్వాయి వైపు వస్తున్న గుర్తుతెలియని ద్విచక్ర వాహనం అతడిని వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో బాలరాజుకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కామరెడ్డిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

జనగామలో కామారెడ్డి జిల్లావాసి మృతి

జనగామ: జనగామ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. జనగామ ఎస్సై రాజేష్ తెలిపిన వివరాలు ఇలా.. కామారెడ్డి జిల్లాకేంద్రంలోని క్వార్టర్ హరిజనవాడకు చెందిన అనాథ నిమ్మల వెంకటేశ్(51) గత రెండు రోజులుగా జనగామ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రధాన గేటు సమీపంలో ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ తీవ్ర అనారోగ్యం పాలయ్యాడు. దయనీయ స్థితిలో ఉన్న అతడు ఆపన్న హస్తం కోసం అరిచినా.. ఎవరూ కనికరించలేదు. ఈక్రమంలో వెంకటేశ్‌ను సాక్షి రిపోర్టర్ చూసి చలించి.. ముస్లిం యువ నాయకుడు సలీంతో కలిసి ఈనెల 11న ఆస్పత్రిలో చేర్పించారు. కానీ అప్పటికే పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రి పోస్టుమార్టం ఫ్రీజర్‌లో భద్రపరిచినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు జనగామ పోలీసులను, లేదా 8712685259, 8712685260ను సంప్రదించాలన్నారు.

మహిళను కాపాడిన పోలీసులకు అభినందన



ఎస్సై భువనేశ్వర్‌ను అభినందిస్తున్న ఎస్పీ

కామారెడ్డి క్రైం: ఆత్మహత్య చేసుకునేందుకు చెరువులో దూకిన మహిళను కాపాడిన ఇద్దరు పోలీసులను పోలీసు కార్యాలయంలో ఎస్పీ రాజేశ్ చంద్ర మంగళవారం అభినందించారు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీలో నివాసం ఉండే ఓ మహిళ కుటుంబ కలహాలతో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకునేందుకు పట్టణ శివారులోని ఓ కుంటలో సోమవారం దూకేసింది. స్థానికుల సమాచారం మేరకు దేవునిపల్లి 2వ ఎస్సై భువనేశ్వర్, కానిస్టేబుల్ బాలకృష్ణలు హుటాహుటినా అక్కడకు చేరుకుని మహిళను చెరువులో నుంచి బయటకు తీశారు. కొన ఊపిరితో ఉన్న ఆమెను ఆస్పత్రిలో చేర్పించారు. కోలుకున్న తరువాత మహిళను కుటుంబ సభ్యులకు అప్పగించారు. మహిళ ప్రాణాలు కాపాడిన ఎస్సై, కానిస్టేబుల్‌లకు నగదు రివార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ చైతన్య రెడ్డి, సీఐ రామన్ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

- కామారెడ్డి ఏఎస్పీ చైతన్య రెడ్డి



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఏఎస్పీ

కామారెడ్డి క్రైం: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకంగా పని చేస్తాయని కామారెడ్డి ఏఎస్పీ చైతన్య రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రం లోని గాంధీగంజ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను మంగళవారం ఆమె ప్రారంభించి మాట్లడారు. మీడియం గూడ్స్ వెహికల్స్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 16 సీసీ కెమెరాలు, కంట్రోల్ రూంను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమన్నారు. పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు, వ్యాపారులు, సంస్థలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ ఎస్‌హెచ్‌వో నరహరి, సిబ్బంది, మీడియం గూడ్స్ వెహికల్స్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు విఠల్‌రావు, సురేష్, బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్వోసీ అందజేత



కామారెడ్డి టౌన్: కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామానికి చెందిన విఠల్ రెడ్డి సతీమణి స్వరూప కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. ఆపరేషన్ అవసరమగా, ఆర్థిక సహాయం కోసం కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన రూ.3 లక్షల విలువైన ఎల్వోసీని ఇప్పించినట్లు మాజీ సర్పంచ్ రవితేజ గౌడ్ తెలిపారు. విఠల్ రెడ్డి కుటుంబ సభ్యులు షబ్బీర్ అలీకి కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంను కలిసిన గడ్డం చంద్రశేఖర్ రెడ్డి



కామారెడ్డి టౌన్: సీఎం రేవంత్ రెడ్డిని హైదరాబాద్‌లోని తన నివాసంలో మంగళవారం టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం సూచించినట్లు చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈసందర్భంగా సీఎంను శాలువాతో చంద్రశేఖర్‌రెడ్డి సన్మానించారు. కామారెడ్డిలో పార్టీ పరిస్థితిని సీఎం అడిగి తెలుసుకున్నారని తెలిపారు.

కాలభైరవుడికి శ్రావణమాస పూజలు



మూలవిరాట్



పూజలకు హాజరైన భక్తులు

రామారెడ్డి: ప్రముఖ పుణ్యక్షేత్రం దక్షిణ కాశీ ఇసన్నపల్లి (రామారెడ్డి) శ్రీకాల భైరవుడి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి నామస్మరణతో ఆలయం మారుమోగింది. అనంతరం అర్చకులు శ్రీనివాస్ శర్మ, వంశీకృష్ణ శర్మ, స్వామివారికి నైవేద్యం సమర్పించారు. ఆలయ సిబ్బంది ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రభు గుప్తా, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మృత్యువులోనూ కలిసే..

- కుంటలో పడి కవలల దుర్మరణం
- కామారెడ్డి మండలం తిమ్మక్ పల్లిలో ఘటన



కవలలు రామ్, లక్ష్మణ్ (ఫైల్)

కామారెడ్డి క్రైం: కవలలుగా కలిసి జన్మించారు. మృత్యువులోనూ కలిసే లోకాన్ని వీడిపోయారు. పిల్లలే సర్వస్వంగా బతుకుతున్న ఆ తల్లిదండ్రులకు జరిగిన ఘటన కడుపుకోతను మిగిల్చింది. ఈ విషాదకర ఘటన కామారెడ్డి జిల్లా తిమ్మక్‌పల్లి గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గుర్రాల పెద్ద నర్సింలు, మంజుల దంపతులకు రామ్, లక్ష్మణ్ (13) అనే కవలలు ఉన్నారు. స్థానికంగా ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాలలో 8 వ తరగతి చదువుకుంటున్నారు. రోజూ మాదిరిగానే సోమవారం సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన వారిద్దరూ బ్యాగులు ఇంట్లో పెట్టి ఆడుకునేందుకు బయటకు వెళ్లారు. రాత్రి 10 గంటలైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు వెతకడం మొదలుపెట్టారు. సమీపం లోని కుంట కట్ట పైన పిల్లల బట్టలు కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. దేవునిపల్లి పోలీసులు, గ్రామస్తులు అక్కడకు పెద్ద ఎత్తున చేరుకుని కుంటలో గాలింపు చర్యలు చేపట్టారు. అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో ఒకరి మృత దేహం, మంగళవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో మరొక బాలుడి మృతదేహలు లభ్యమయ్యాయి. సరదాగా గడిపేందుకు నీళ్ల లోకి దిగి లోతు ఎక్కువగా ఉండటంతో ఈత రాక నీటమునిగి ఉండవచ్చని భావిస్తున్నారు. మృతి చెందిన కవల పిల్లల తండ్రి నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని దేవునిపల్లి ఎస్సై రంజిత్ తెలిపారు.

కుటుంబంలో తీరని విషాదం..

గ్రామానికి చెందిన పెద్ద నర్సింలు నిత్యం కామారెడ్డికి వచ్చి రోజువారీ మేస్త్రీ పనులు చేస్తూ, మంజుల బీడీలు చుడుతూ జీవనం సాగిస్తున్నారు. 13 ఏళ్ల క్రితం నర్సింలు దంపతులకు కవలలు పుట్టారు. ఇద్దరు కుమారులు ఒకేసారి జన్మించడంతో తరువాత సంతానం వద్దనుకున్నారు. రామ్, లక్ష్మణ్ అనే పేర్లు పెట్టుకుని అల్లారు ముద్దుగా చూసుకుంటున్నారు. పిల్లలే సర్వస్వంగా ఉన్నదాంట్లో సంతోషంగా బతుకుతున్నారు. ఉన్న ఇద్దరు పిల్లలు ప్రమాదవశాత్తు చనిపోవడం ఆ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. తల్లిదండ్రులు, బంధువులు కన్నీటిపర్యంతమయ్యారు.